నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | నల్లగొండ, శుక్రవారం 16 మే 2025 | YADADRI BHUVANAGIRI


యాదగిరిగుట్ట క్షేత్రంలో తెలుగు సంప్రదాయ దుస్తుల్లో నమస్కారం చేస్తున్న ప్రపంచ సుందరీమణులు

# అందాల భామలు అద్భుతః

**చీర కట్టులో యాదగిరీశుడి ఆలయ సందర్శన.. కృష్ణ శిలలు చూసి మంత్రముగ్ధులు**

**పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీపై క్షుణ్ణంగా పరిశీలన**

**అదరగొట్టిన మోడల్స్ ర్యాంప్ వాక్**

## భూదాన్ పోచంపల్లి, యాదగిరి గుట్ట సందర్శించిన మిస్ వరల్డ్ సుందరీమణులు


పోచంపల్లి హంపీ థియేటర్‌లో అందాల భామ ర్యాంప్ వాక్


పోచంపల్లి టూరిజం పార్కులో మిస్‌వరల్డ్ పోటీదారులు

యాదాద్రి భువనగిరి, మే 15 (నమస్తే తెలంగాణ)/ భూదాన్‌పోచంపల్లి : మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన యాదాద్రి జిల్లాలో ఉత్సాహంగా సాగింది. యాదగిరి గుట్ట ఆలయంతోపాటు భూదాన్ పోచంపల్లిని గురువారం రెండు బృందాలు వేర్వేరుగా సందర్శించాయి. భూదాన్ పోచంపల్లిలో మిస్ వరల్డ్ పోటీదారుల పర్యటన అట్టహాసంగా కొనసాగింది. ఆఫ్రికా ఖండానికి చెందిన 25 మంది సుందరీమణులు సాయంత్రం 5.30 గంటలకు పోచంపల్లి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి తిలకం దిద్ది, చేనేత శాలువాలతో సత్కరించి.. కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టుగూళ్ల నుంచి దారం తయారీ, చిటికీ కట్టడం, రంగులు అద్దడం, పంటెలు తిప్పడం, రాట్నంతో కండెలు వడకడం, మగ్గం నేయడం లాంటి వస్త్ర తయారీ విధానాన్ని వివరించారు. ఈ ప్రక్రియ ఆసాంతం ముద్దుగుమ్మలు తమ ఫోన్లలో బంధించారు.


యాదగిరిగుట్ట క్షేత్రంలో ఓ మిస్ వరల్డ్ పోటీదారును ఆశీర్వదిస్తున్న ప్రధానార్చకుడు


### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటిచెప్పేలా..

సుందరీమణుల పర్యటనలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటిచెప్పేలా ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ ఏర్పాటు చేశారు. అందగత్తెలతో ఆడి పాడించారు. కిన్నెర వాయింపులు, డప్పు చప్పుళ్లతో స్టెప్పులు వేసి అదరహో అనిపించారు. స్వయంగా కిన్నెర సాన్ని వాయించారు. డప్పులు కొట్టారు. మెహేంది పెట్టుకుని సంతోషం వ్యక్తం చేశారు.

### ఆకట్టుకున్న మోడల్స్ ర్యాంప్ వాక్

హంపీ థియేటర్లో ఏర్పాటు చేసిన ర్యాంప్ వాక్ విశేషంగా ఆకట్టుకుంది. చేనేత వస్త్రాలతో తయారు చేసిన డిజైన్లతో మోడల్స్ షో మైమరిపింపజేసింది. ఈ కార్యక్రమాన్ని సుందరీమణులు ఆసక్తిగా తిలకించారు. అంతకుముందు జై తెలంగాణ పాటతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం, పర్యాటకం, పోచంపల్లి గురించి వీడియో ప్రదర్శన చేశారు. రాత్రి 8 గంటలకు ఈవెంట్ ముగియడంతో హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ ఈవెంట్ ఇన్‌చార్జి లక్ష్మి, కలెక్టర్ హనుమంతరావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాచకొండ సీపీ సుధీర్ బాబు, డీసీపీ ఆకాంక్ష యాదవ్, రాష్ట్ర టూరిజం శాఖ జీఎం ఉపేందర్ రెడ్డి, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాసరావు, అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




పోచంపల్లిలో రాట్నం వడుకుతున్న మిస్ వరల్డ్ పోటీదారు

## యాదగిరి గుట్ట టెంపుల్ సో బ్యూటిఫుల్

- లక్ష్మీనరసింహుడి క్షేత్రానికి ప్రపంచ సుందరీమణుల కితాబు


యాదగిరిగుట్టలో కృష్ణ శిలలను పరిశీలిస్తూ..

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని గురువారం సాయంత్రం ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. స్వయంభువును దర్శించుకొని ఆలయ శిల్ప కళా సంపదను వీక్షించారు. టెంపుల్ సో బ్యూటి పుల్ అని కితాబునిచ్చారు. కరేబియన్ గ్రూప్ సుందరీమణులైన జాడా రామూన్, షుబ్రెయిన్ డ్యామ్స్, మైరా డెల్గాడో, నోయెమీ మల్నే, క్రిస్టీ గైరాండ్, తహ్జ్ బెన్నెట్, ఆరేలీ జోచిమ్, వలేరియా పెరెజ్, అన్నా లిస్ నాంటన్ కలిసి తెలుగు సంప్రదాయ రీతిలో లంగా ఓణి, చీర కట్టుతో సందడి చేశారు. కొండపైన వీవీఐపీ అతిథి గృహానికి చేరుకొని, అఖండ దీపారాధన పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సాంస్కృతిక కళాకారుల సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఘన స్వాగతం పలుకుతుండగా బ్రహ్మోత్సవ మండపం వద్దకు చేరుకున్నారు. అక్కడే ఫొటో షూట్‌లో పాల్గొన్న సుందరీమణులు ఫోజులిచ్చారు. అనంతరం ధ్వజ స్తంభానికి మొక్కి అక్కడి నుంచి నేరుగా గర్భాలయంలోకి ప్రవేశించి స్వయంభు లక్ష్మీ నరసింహ స్వామి వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనానంతరం ఆలయ ముఖ మండపంలో ప్రధానార్చక బృందం చతుర్వేదాశీర్వచనం చేయగా ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ కలిసి వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానాలయ ముఖ మండపంలోని ఉపాలయాలు, ఆళ్వారు పిల్లర్లు, ధ్వజస్తంభం, వివిధ రకాల ఆకృతులు, స్వామివారి ఆలయ విశిష్టత, స్థల పురాణాలను ఆలయ పారాయణికులు నల్లన్‌థీఘళ్ సీతారామాచార్యులు సుందరీమణులకు వివరించారు. దర్శనానంతరం మొదటి ప్రాకార మండపంలోని యాళీ పిల్లర్లు, అద్దాల మండపం, సప్తతల రాజగోపురం, కల్యాణ మండపాలతో, సింహాకార ఆకృతులను వీక్షిస్తూ మంత్రముగ్ధులయ్యారు. ఆలయ నిర్మాణంలో చేపట్టిన పనులు, విశేషాలను వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు వారికి వివరించారు. లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునే భాగ్యం లభించడం అనందంగా ఉందన్న సంకేతాలను వారు ఇచ్చారు. అనంతరం పశ్చిమ సప్తతల రాజగోపురం గుండా మాఢవీధుల్లోకి రాగా అక్కడ నెమలి ఈకలతో సంప్రదాయ నృత్యాలు, కూచిపూడి, భరతనాట్యాలను చూస్తూ వారితో కలిపి నృత్యాలు చేశారు. ప్రపంచ సుందరీమణుల పర్యటనలో భాగంగా రాచకొండ సీపీ సుధీర్‌బాబు నేతృత్వంలో మూడంచెల భారీ బందోబస్తును నిర్వహించారు. పర్యటన ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, జిల్లా, ఆలయ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


ఆలయ నిర్మాణాన్ని తిలకిస్తున్న ప్రపంచ సుందరీమణి


తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్రను ప్రారంభిస్తున్న చెరుకు సుధాకర్ గౌడ్

## తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ మోసపూరిత హామీలు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్‌గౌడ్

తుంగతుర్తి, మే 15 : తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్‌గౌడ్ అన్నారు. ఉద్యమ కారులకు హామీల అమలు కోసం తుంగతుర్తి మండలం కొత్తగూడెం గ్రామంలో కామ్రేడ్ వీరన్న స్తూపం నుంచి గురువారం ఉద్యమకారులు చేపట్టిన పాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, పెన్షన్, హెల్త్‌కార్డులు, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఇస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వాటిని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చిందని విమర్శించారు. రేవంత్ సర్కారు ఈ 17 నెలల పరిపాలనలో ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. ఉద్యమకారుల హామీలు అమలయ్యే వరకూ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని, దీనికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజిరెడ్డి, దుగ్యాల రవీందర్, జానీ, గోపగాని వెంకన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

## గుట్ట అభివృద్ధిని మరిచి సుందరీమణుల పర్యటనకు ఖర్చులా?

- స్వామివారి నిధులు తరలించడం సిగ్గు చేటు
- బీఆర్‌ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య

యాదగిరిగుట్ట, మే15 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య క్షేత్ర అభివృద్ధిని మరిచి ప్రపంచ సుందరీమణుల పర్యటనకు దేవస్థాన ఖజానా ఖర్చు చేయడమేంటని బీఆర్‌ఎస్ యాదగిరి గుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య ప్రశ్నించారు. స్వామివారి నిధులు తరలించడం సరైంది కాదన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన ప్రపంచ సుందరీమణుల పర్యటనకు దేవస్థాన ఖజానా నుంచి రూ. 35 లక్షల డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. అందాల భామల పర్యటనకు రాష్ట్ర ప్రభుత్వం రూ 200 కోట్ల కేటాయించిన తర్వాత కూడా స్వామివారి ఆదాయంలో నుంచి నిధులు కేటాయించడం పట్ల అనుమానాలకు తావిస్తున్నాయని తెలిపారు. వరంగల్ పర్యటనలో భాగంగా తెలంగాణ బిడ్డలతో సుందరీమణుల కాళ్లు కడిగించడం, దుస్తులతో కాళ్లు తుడిపించడం వంటి చేష్టలు మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా ఉన్నాయని చెప్పారు. ఇవి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిగ్గులేని చర్యలుగా ఆయన అభివర్ణించారు. అధికారంలోకి వచ్చి 17 ఏండ్లు గడిచినా ఇప్పటి వరకు గుట్ట దేవస్థాన అభివృద్ధికి రూపాయి సైతం కేటాయించకపోగా, స్వామి వారి ఖజానాను దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆదాయానికి గండికొట్టేందుకే ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ రూ. 1300 కోట్లతో ఎంతో అద్భుతంగా దేవస్థానాన్ని తీర్చిదిద్దారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ బీసీ విభాగం మండలాధ్యక్షుడు కవిడె మహేందర్, నాయకులు గుణగంటి బాబురావుగౌడ్, ఎగ్గిడి కృష్ణ, సిరబోయిన నర్సింగ్‌యాదవ్, బొట్ల నర్సింహ పాల్గొన్నారు.


మునగాల తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అవకతవకలు

- భూములు, ఇండ్లు ఉన్నవారికే ఇస్తున్నారు
- మునగాలలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా

మునగాల, మే 15 : ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అధికారులు, కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కై అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ గురువారం మునగాల తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ మునగాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం చేసిన సర్వే బోగస్ అని, అధికారులు లేకుండా, ఎటువంటి సర్వే చేయకుండా కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన జాబితానే ఫైనల్ చేశారని అన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని, జాబితాలో పేర్లు ఉన్న వారు సగానికి పైగా భూములు, ఇండ్లు ఉన్నవారేనని విమర్శించారు.

ఇందిరమ్మ ఇండ్ల కమిటీ నాయకులు అధికారులను తప్పుదోవ పట్టించి వారి అనుచరులకు ఇచ్చారని, అర్హులైన నిరుపేదలకు మొండి చేయి చూపించారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లపై రీ సర్వే చేయాలని, పేదల పక్షాన బీఆర్‌ఎస్ నిలబడి ఇండ్లు మంజూరు అయ్యే వరకు పోరాడుతుందని చెప్పారు. అనంతరం తాసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందిబండ సత్యనారాయణ, ఉడుం కృష్ణ, ఎల్‌పీ రామయ్య, నాగేశ్వర్‌రావు, వసంతకుమార్, నాగబాబు, యల్లయ్య, వెంకన్న, రాజేశ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో జీవాలు జాగ్రత్త

- పెరుగుతున్న ఉష్ణోగ్రతతో వడదెబ్బ
- జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యులు


పశువుకు వ్యాక్సిన్ వేస్తున్న మండల పశువైద్యాధికారి రవికుమార్

నూతనకల్, మే 15 : వేసవి తాపం నుంచి పశువులు, గేదెలు ఇతర జీవాలను రక్షించుకోవడంతో పాటు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు రైతులు పశువైద్యాధికారుల సూచనలు పాటిస్తూ, జాగ్రత్తలు వహించాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పశువులకు చూడి పరీక్షలు చేయించి, లోపాలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. గాలికుంటు, జబ్బవాపు, గురక, దొంసులీరియాసిస్ వంటి స్థానికంగా కనిపించే అంటు వ్యాధుల నివారణకు టీకాలను వేయించాలి. గేదెలు, దూడలకు వెంట్రుకలు కత్తిరించి పేలు, పిడుదులు, గోమార్ల నివారణకు చర్యలు తీసుకోవాలి. పశువుల పాక కొంచెం ఎత్తులో ఉండేలా, పచ్చని ఆకులతో వేసిన చల్లని పందిళ్లలో పశువులను కట్టేయాలి. పందిరిపై నీటితో తడుపుతూ, ప్రతి రోజూ సాయంత్రం చల్లటి నీటితో శుభ్రం చేస్తుండాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేత కోసం బయటకు తీసుకెళ్లక పోవడమే మంచిది. వైద్యుల సూచన మేరకు క్లోరైడ్ లవణాన్ని నీటిద్వారా ఇవ్వాలి. విటమిన్ –ఏ పాడి పశువులకు ఉష్ణోగ్రత, ఒత్తిడి నుంచి రక్షిస్తుంది. ఎండు గడ్డిని రాత్రి సమయంలో ఇవ్వాలి. పచ్చి మేత లభించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రోజుకు 60 గ్రాముల లవణ మిశ్రమం ఇచ్చి పచ్చిమేత మేపాలి. అయోడిన్ కలిగిన ఉప్పును దాణాతో కలిపి ఇవ్వాలి. రోజుకు రెండు సార్లు చల్లని నీటితో స్నానం చేయించడంతో ఎండ తీవ్రత నుం చి గేదెలు ఉపశమనం పొందుతాయి. దీనివల్ల పాల దిగుబడి తగ్గకుండా కాపాడుకోవచ్చు .

### పశువుల పాకలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించేందుకు ఈజీఎస్ ద్వారా పశువుల పాకలు నిర్మిస్తున్నది. పశువులకు వడదెబ్బ తగులకుండా ఈ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– రవికుమార్, మండల పశువైద్యాధికారి, నూతనకల్

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

**ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య**

**అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు**


నల్లగొండ డీఎస్పీ కార్యాలయంలో హత్య వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

గట్టుప్పల్, మే 15 : వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను ప్రియుడితో కలిసి భార్య హత్య చేసినట్లు నల్లగొండ డీఎస్పీ శివరామిరెడ్డి తెలిపారు. ఇటీవల గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామంలో జరిగిన హత్య వివరాలను డీఎస్పీ గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన వల్లపు మల్లేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య హేమలతకు అదే గ్రామానికి చెందిన రేవెల్లి నవీన్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలిసిన మల్లేశ్ భార్య హేమలతను పలుమార్లు మందలించాడు. అయినా ఆమె తీరు మారలేదు. తన వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్త మల్లేశ్‌ను హత్య చేయాలని హేమలత నిర్ణయించుకుంది. అందుకు ఆమె ప్రియుడు నవీన్‌తో కలిసి పథకం రూపొందించింది. వీరు వేసుకున్న పథకం ప్రకారం ఈ నెల 10న మల్లేశ్‌కు హేమలత ప్రియుడు నవీన్ తన బైక్‌పై తీసుకెళ్లి ఫుల్‌గా మద్యం తాపించాడు. అనంతరం బైక్‌పై ఇంటికి తీసుకొచ్చి దింపాడు. అదేరోజు రాత్రి మద్యం మత్తులో ఉన్న మల్లేశంను నవీన్‌తో పాటు హేమలత గొంతు నులిమి హత్య చేశారు. అతడిది సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు యత్నించారు. మృతుడి తల్లి వెంకటమ్మ కోడలు హేమలతపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన చండూరు సీఐ ఆదిరెడ్డి, గట్టుప్పల్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్ఐ అంజయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

## రైలు బోగిలో మంటలు.. తప్పిన ప్రమాదం


డెమో ట్రైన్‌లోని ఓ బోగి కింద మంటలు

బీబీనగర్, మే 15 : మిర్యాలగూడ నుంచి కాచిగూడకు వెళ్తున్న డెమో ప్యాసింజర్ (లోకల్ ట్రైన్)లో గురువారం స్వల్పంగా మంటలు చెలరేగాయి. బీబీనగర్ మండల పరిధిలోని పగిడిపల్లి రైల్వే స్టేషన్ ఆవరణలోకి రాగానే రైలు బోగి నుంచి దట్టమైన పొగలు రావడం గుర్తించిన ప్రయాణికులు వెంటనే అప్రమత్తమై రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. రైల్వే సిబ్బంది బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో రైలును ఆపి బోగిలో చెలరేగిన మంటలను ఆర్పివేశారు. బ్రేక్ పాడ్‌లో రాపిడి కారణంగా మంటల చెలరేగినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. మంటలు ఆర్పిన అనంతరం రైలు కాచిగూడకు బయల్దేరింది. ఈ ఘటనలో ఎవరికీ అపాయం జరుగలేదు.

## చెరువులో దూకి ఎయిమ్స్ వైద్య విద్యార్థి ఆత్మహత్య

బీబీనగర్, మే 15 : మండల కేంద్రంలోని పెద్ద చెరువులో దూకి ఎయిమ్స్ వైద్య విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లాకు చెందిన అభిజిత్ జాయ్ (25) నాల్గో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో అభిజిత్ కళాశాల నుంచి తన ద్విచక్ర వాహనంపై బయల్దేరి బీబీనగర్ పెద్ద చెరువు వద్దకు చేరుకున్నాడు. అనంతరం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అభిజిత్ తండ్రి పి.పి జాయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని చెప్పారు.